# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సాయంత్రం విజయవాడ ఉత్సవ్ కార్నివాల్‌ను ప్రారంభిస్తారు.**
2. **స్వాతంత్ర పోరాటంలో మహనీయుల త్యాగఫలాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**
3. **ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు.**
4. **విజయవాడలో ఈనెల 6వ తేదీన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను ప్రదానం చేయనున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వెల్లడించింది.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విజయవాడలో పర్యటిస్తారు. సాయంత్రం 4 గంటల 30నిమిషాలకు ఖాదీ స్టాల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు విజయవాడ ఉత్సవ్ కార్నివాల్‌ను ఆయన ప్రారంభిస్తారు. ఈ రాత్రి విజయవాడ ఉత్సవ్ ముగింపు వేడుకల్లో పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

స్వాతంత్ర పోరాటంలో మహనీయుల త్యాగఫలాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు వారి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జై జవాన్, జై కిసాన్ నినాదంతో దేశంలో కొత్త ఉత్సాహాన్ని మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి నింపారన్నారు. మహనీయుల ఆదర్శాలను పాటించి, యువత సన్మార్గంలో నడవాలని పిలుపునిస్తూ...

..వాయిస్.. 26 సెకన్లు

--------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యతనిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. “సేవా పర్వ్” పేరుతో ఆకాశవాణి విజయవాడ

ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. జాతీయ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ఈరోజు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01:33)

---------------------------

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో "స్వచ్ఛతాన్ 10కే మారథాన్" కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ నినాదంతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చేపట్టిన ఈ కార్యక్రమానికి 11 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వారికి పతకాలు అందజేశారు.

---------------------------

విజయవాడలో ఈనెల 6వ తేదీన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను ప్రదానం చేయనున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ తెలిపింది. స్వచ్ఛ మునిసిపాలిటీలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ స్కూల్స్ , స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛ కార్యాలయాలు, స్వచ్ఛ రైతు బజార్లు, స్వచ్ఛ బస్సు స్టేషన్లు, స్వచ్ఛ పరిశ్రమల కేటగిరీల్లో అవార్డులను ఇవ్వనున్నట్లు వివరించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని అవార్డులను ప్రదానం చేస్తారని పేర్కొంది.

---------------------------

పరిసరాల పరిశుభ్రత అందరి సమిష్టి బాధ్యత అని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా తెలిపారు. విజయవాడ రైల్వే డివిజన్ కార్యాలయ పరిసరాల్లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే అధికారులు, సిబ్బంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సఫాయి కర్మచారులచే స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు.

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించడంతో పేద మధ్యతరగతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలో జిఎస్టి తగ్గింపు సందర్భంగా నిన్న ర్యాలీ నిర్వహించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి తెలుపుతూ..

– వాయిస్.. ...35 సెకన్లు

---------------------------

స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా పశ్చిమ గోదావరి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 15 రోజులపాటు జిల్లావ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు పశ్చిమగోదావరి జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ ఎంఎస్ వీఎస్ భద్రిరాజు చెప్పారు. భీమవరంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. భీమవరం, తణుకు రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ల ద్వారా మొత్తం 142 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు తెలిపారు.

---------------------------

జాతిపిత మహాత్మా గాంధీ వ్యక్తిత్వం, చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈరోజు ఒంగోలులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహనీయుల జయంతులను నిర్వహించుకోవడం మనందరి అదృష్టమన్నారు. వారు చూపిన మార్గంలో పయనిస్తూ వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని నడవాలని సూచించారు.

---------------------------

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా చక్రస్నాన మహోత్సవం ఈరోజు వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు నిర్వహించారు. చక్రస్నానం సమయంలో వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఈ రాత్రికి ధ్వజావరోహణం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది ఉత్తర, వాయువ్య దిశగా కదులుతూ తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ రాత్రికి గోపాలపూర్ – పారాదీప్ ల మధ్య దక్షిణ ఒడిశా – ఉత్తర కోస్తా తీరాలను దాటే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో ఈ రోజు ఉత్తర కోస్తా జిల్లాల్లో అతి భారీ వర్షాలు దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

మరోవైపు... తీరం వెంబడి 40 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉండడంతో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకూడదని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

---------------------------

భారత క్రికెట్ జట్టు.. స్వదేశంలో వెస్టిండీస్‌తో సిరీస్‌కు సిద్ధమైంది. భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఈరోజు ప్రారంభమైంది. తొలి టెస్ట్ అహ్మదాబాద్‌లో జరుగుతోంది. మొదట టాస్ గెలిచిన వెస్టిండీస్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి వెస్టిండీస్ జట్టు 134 పరుగులకు 6 వికెట్లు నష్టపోయింది.

---------------------------

భారత్ సంచార్ నిగం లిమిటెడ్ వినియోగదారులకు నాణ్యమైన టెలికాం సేవలను అందిస్తోందని అనంతపురం బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా తెలిపారు. ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయని, అతి తక్కువ ధరలకే అందిస్తోందని తెలిపారు.

=====================